పశువులను ఎత్తుకెళ్లిన దొంగలు

బోథ్, డిసెంబర్ 25 : కౌఠ(బీ) గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు పశువులను ఎత్తుకెళ్లారు. బాధితుల కథనం ప్రకారం.. చిట్నాడి పోతన్నకు చెందిన ఆవు దూడ, కంకను రోజువారి మాదిరిగా బస్టాండ్ ఎదుట ఉన్న వేప చెట్లకు కట్టేసి ఉంచారు. మెల్లెపూల బాపయ్యకు చెందిన రెండు కంకలను ఇంటి పక్కన ఉన్న పశువుల పాక వద్ద కట్టి ఉంచారు. దొంగలు అర్ధరాత్రి సమయంలో వాటి తాళ్లను కోసి గుర్తు తెలియని వాహనంలో తరలించినట్లుగా బాధితులు అనుమానిస్తున్నారు. బస్టాండ్ ఎదుట ఉన్న సీసీ కెమెరా పని చేయకపోవడంతో పశువులను ఎటువైపు తీసుకెళ్లారో తెలియకుండా పోయింది. బాధితులు బుధవారం చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లి ఆరా తీసిన పశువుల ఆచూకీ తెలియక పోయింది.

ద్విచక్రవాహనం దొంగతనం

ఎదులాపురం, డిసెంబర్ 25: ఆదిలాబాద్‌లోని తిర్పెల్లి కాలనీలోని ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం దొంగతనమైనట్లు వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. మంగళవారం పబ్బ అనురాధ రాత్రి ఇంటి ముందు యాక్టివా ద్విచక్ర వాహనం పార్కింగ్ చేశారు. పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం బుధవారం ఉదయం చూసేసరికి కనిపించలేదు. దీంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోథ్, డిసెంబర్ 25: కౌఠ(బీ) గ్రామానికి చెందిన చిట్యాల సుజిత్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం ఎలేటి అశ్విన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వీడీసీ అధ్యక్షుడు బాడల శ్రీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు సురేందర్, పవన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కుంట ప్రవీణ్ రెడ్డి, సుద్దాల రాజేశ్వర్, ఇంద్ర కరణ్ రెడ్డి ఉన్నారు.

జిల్లా మెపా నూతన కమిటీ ఎన్నిక

ఎదులాపురం, డిసెంబర్ 25: ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) ఆదిలాబాద్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎల్ మహేశ్, ప్రధాన కార్యదర్శిగా ఒరగంటి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. జిల్లాలో అన్ని మండలాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామని, సంఘం అభివృద్ధి, ఐక్యత, రిజర్వేషన్ సాధన కోసం కృషి చేస్తామని ఎన్నికైన సభ్యులు తెలిపారు.

ఘనంగా వాజ్‌పేయి జయంతి

నివాళులర్పిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, డిసెంబర్ 25: భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆయన చిత్రపటానికి పూలమాలలు లేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్ రావు పటేల్ పాల్గొన్నారు

హస్నాపూర్‌కు చేరుకున్న సేవాలాల్ పాదయాత్ర



మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 25 : తమ సమస్యలు పరిష్కరించాలని సేవాలాల్ సేనా ప్రజారాగ్ జోల్ యాత్ర బుధవారం ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చేరుకుంది. వారికి బంజారా నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బంజారాలు రాష్ట్ర వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ సేనా వర్కింగ్ ప్రెసిడెంట్ రవి నాయక్, బంజారా నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు విరమించుకోవాలి

ఎదులాపురం, డిసెంబర్ 25: సమ్మె చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయుల స్థానంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యుటేషన్లు విరమించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే కిష్టన్న, వీ అశోక్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా శ్రమదోపిడీకి గురవుతున్నది ఈ ఉద్యోగులేనని, చేస్తున్న పనికి సమానమైన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం మాత్రమే వారు కోరుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, మొదటి పీఆర్సీ సిఫారసు మేరకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్న ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఆ క్రమంలోనే ఉద్యోగులు స్వచ్ఛందంగా నిరవధిక సమ్మెకు దిగారు. కేజీబీవీ, యూఆర్ఎస్, ఆశ్రమ పాఠశాలల్లో పిల్లలకు విద్యాబోధన కుంటుపడిందన్నారు. శుక్రవారం నుంచి సమ్మెను ఉధృతం చేస్తామని వారు ప్రకటించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని డిమాండ్ చేశారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

బోథ్, డిసెంబర్ 25 : ఘన్పూర్ గ్రామంలో బుధవారం మూడు హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. గ్రామంలోని హనుమాన్, జగదాంబ దేవి ఆలయ ఆవరణలో, కుమ్రం భీంచౌరస్తాలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. కార్యక్రమంలో రాథోడ్ భగవాన్‌దాస్ పాటిల్, రాథోడ్ సుదర్శన్, జాదవ్ గులాబ్, రాథోడ్ హరి, కృష్ణ మహారాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూజలు చేసి లైట్లు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

యథేచ్ఛగా వనమేధం

- ఖానాపూర్ అడవుల్లో పది టేకు చెట్లు నరికిన స్మగ్లర్లు
- చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

ఖానాపూర్, డిసెంబర్ 25: నిర్మల్ జిల్లా ఖానాపూర్–నిర్మల్ ప్రధాన రహదారికి 100 మీటర్లు దూరంలో కలప స్మగ్లర్ల గొడ్డలి వేటుకు 30 ఏండ్లపై బడిన పది భారీ టేకు వృక్షాలు కుప్పకులాయి. స్థానికులు, అధికారులు, బడ నాయకుల అండదండాలతో స్మగ్లర్లు విలువైన టేకు చెట్లను యథేచ్ఛగా నరికి వేసి కలపను తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. ఖానాపూర్ బీట్ పరిధిలో అడవులను కాపాడాల్సిన బీట్, సెక్షన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్మగ్లర్లకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్న విమర్శలు తలెత్తుతున్నాయి. కవ్వాల్ అటవీ సంపద సంరక్షణలో సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా మారుతుంది. విధులపై నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఐదు రోజుల క్రితం ఖానాపూర్ బీట్ పరిధిలో ఇష్టారాజ్యంగా నరికిన టేకు చెట్లే ఇందుకు నిదర్శనం. జాతీయ రహదారి పక్కన నుంచి రెండు సార్లు జోరుగా కలప దందా జరగడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

రెండు సార్లు నరికివేతకు గురి..

ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు ఈ నెల 14, 18న రెండు సార్లు కోత యంత్రాలతో గుట్టు చప్పుడు కాకుండా పది భారీ వృక్షాలను నేలమట్టం చేసి ఆరు దుంగాలను తరలించినట్లు అధికారులు వెల్లడించారు. స్మగ్లర్లు నరికి వదిలేసిన దుంగాలకు అటవీ శాఖ సిబ్బంది మార్కింగ్ వేసి ఖానాపూర్ అటవీ శాఖ కలప డిపోకు తరలిస్తున్నారు. స్థానిక ఎఫ్‌బీవో ముత్యంను వివరణ కోరగా తాను పాత తర్లపాడుతో పాటు ఎక్బాల్‌పూర్, ఖానాపూర్ అటవీ పరిధికి ఇన్‌చార్జిగా ఉండడంతో పని భారంతో ఇలాంటి సంఘటన చోటు చేసుకుందని వివరించారు. జాతీయ రహదారికి అతి సమీపంలో భారీ వృక్షాలు కోతకు గురికావడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది. అధికారులు విధులు నిర్వహిస్తున్నారా లేదా అన్న ఆపోహాలు తెరపైకి వస్తున్నాయి.

స్మగ్లర్ల చేతుల్లో కోతకు గురైన భారీ టేకు వృక్షం

యంత్రాలతో దుంగలుగా చేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న టేకు కలప

టేకు చెట్ల నరికివేతపై చర్యలు తీసుకుంటాం

ఖానాపూర్ బీట్ పరిధిలో టేకు చెట్ల నరికి వేతపై తగిన చర్యలు తీసుకుంటాం. అటవీ సంపద కాపాడేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు కలప తరలింపునకు పాల్పడ్డ నలుగురి వ్యక్తులను గుర్తించాం. సెల్‌ఫోన్ నెట్‌వర్క్ ద్వారా నిందితులను గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నాం. టేకు చెట్లు నరికిన వారిని గుర్తించి కేసు నమోదు చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలప దొంగలను త్వరలోనే పట్టుకుంటాం. కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే ఎంతటివారైన ఉపేక్షించేది లేదు.

-కే కిరణ్, ఎఫ్ఆర్‌వో, ఖానాపూర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భైంసా, డిసెంబర్, 25 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం భైంసాలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సిద్ధార్థ నగర్‌కు చెందిన దగ్గే ఆముల్ (25) భైంసా– నిర్మల్ జాతీయ రహదారిపై కాలనీ వైపు నుంచి పట్టణంలోకి వస్తుండగా నిర్మల్ చౌరస్తా సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అటు వైపు నుంచి వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఆగి పరిశీలించారు. అనంతరం పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఏరియా దవాఖానకు తరలించారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి..

కుంటాల, డిసెంబర్ 25 : భైంసాకు చెందిన జాదవ్ భోజరాం పటేల్ (53) బుధవారం ఉదయం మండలంలోని కల్లూరు బ్రిడ్జి కింద గల చెక్‌డ్యాం వద్ద నిలిచిన నీటిలో కాలకృత్యాలకు దిగాడు. ప్రమాదవశాత్తు ఈతరాక మునిగిపోయి మృతి చెందాడు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ భాస్కరచారి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లక్ష్మణచాంద, డిసెంబర్ 25 : వడ్యాల్ గ్రామంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ జానకి తెలిపారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆమె తెలిపారు.

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

లక్ష్మణచాంద, డిశంబర్ 25: లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ గ్రామ సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కనకాపూర్ నుంచి వడ్యాల్ వైపు వెళ్తున్న ఆటో కనకాపూర్‌లోని దాబా హోటల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన గేదెను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తాపడింది. ఆటోలో ఉన్న ప్రయాణికులందరూ కిందపడిపోయారు. నిజామాబాద్‌కు చెందిన నర్సింగరావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, ఆయన బంధువులు ఆయనను నిర్మల్‌లోని దవాఖానకు తరలించారు. మిగతా ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు.

కేసీఆర్ మేలు మరువలేం

నినాదాలు చేస్తున్న దళిత బస్తీ లబ్ధిదారులు

తాంసి, డిసెంబర్ 25: దళిత బస్తీ లబ్ధిదారులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన మేలు మరువలేమని మాజీ వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు అన్నారు. బుధవారం మండలంలోని పొన్నారి గ్రామంలో దళిత బస్తీ లబ్ధిదారులకు రూ.3 లక్షల విలువైన మోటార్స్ పంప్స్, స్టార్టర్ బోర్డు పరికరాలను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆదేశాల మేరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు జై తెలంగాణ, జై కేసీఆర్, జై అనిల్ అన్న అంటూ నినాదాలు చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన దళిత బస్తీ భూమి వారికి జీవితాంతం గుర్తుండిపోతుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, మాజీ సర్పంచ్ అశోక్, సొసైటీ డైరెక్టర్ చంద్రన్న, సీనియర్ నాయకులు మల్లయ్య, రమణ, మాజీ ఎంపీటీసీ విలాస్, ఆశన్న, సాయినాథ్, శ్రీకాంత్, రవి, దళిత బస్తీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

సరస్వతి కెనాల్‌కు నీరు విడుదల

సోన్ : ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సోన్, డిసెంబర్ 25: సరస్వతి కెనాల్ కింద పంటలు సాగు చేసే రైతులు నీటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలు పండించుకోవాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం సోన్ మండలం గాంధీనగర్ గ్రామం వద్ద శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో పంటలు పండించుకునేందుకు రైతులకు సరస్వతి కెనాల్ ద్వారా నీటిని విడుదల చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బర్ల హరీశ్‌రెడ్డి, సరికెల గంగన్న, జమాల్, రమేశ్‌రెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 25: నిర్మల్ నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని శాసనసభా పక్షనేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. పట్టణంలోని వెంకటాపూర్ కాలనీలో రూ.1.60 కోట్లతో నిస్సి చర్చి వరకు నిర్మించిన బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం గాజులపేట్ కాలనీలోని సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్లను పంచిపెట్టారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరగా రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రావుల రాంనాథ్, తదితరులు పాల్గొన్నారు. లక్ష్మణచాంద, డిసెంబర్ 25 : వడ్యాల్ గ్రామంలో వడ్యాల్ నుంచి రత్నాపూర్ కాండ్లి వరకు రూ.2.25 కోట్లతో చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, రమేశ్, సరికెల గంగన్న, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

బేల, డిసెంబర్ 25 : సంగారెడ్డిలో 2025 జనవరి 25–28వ తేదీల్లో నిర్వహించే సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పూసం సచిన్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని పాటగూడ గ్రామంలో మహాసభల ప్రచార కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు స్వామి, గ్రామ పటేల్ తొడసం నాగోరావ్, గ్రామస్తులు శంభు లక్ష్మణ్, రాజేశ్వర్, అమృత్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

భైంసా: మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్

ఉట్నూర్‌రూరల్: కేక్ కట్ చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: హోలీ ట్రినిటి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఏసు మార్గం అనుసరణీయం

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి

ఎదులాపురం/జైనథ్/బేల/బోథ్/ ఇచ్చోడ/నేరడిగొండ/ఉట్నూర్/ఉట్నూర్‌రూరల్/ఇంద్రవెల్లి/నార్నూర్/సోన్/భైంసా/కుంటాల/ముథోల్/దస్తురాబాద్, డిసెంబర్ 25: ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో క్రైస్తవులు బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కేకు కోశారు. ఏసు ప్రభువుపై గీతాలు ఆలపించారు. ఏసు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, ఆయన చూపిన బాటలోనే నడవాలని ఆయా చర్చిల పాస్టర్లు పేర్కొన్నారు. పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు ఆలపించిన భక్తి గేయాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. నేరడిగొండలో నిర్వహించిన వేడుకల్లో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, ఉట్నూర్ మండలంలోని గ్రామాల్లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్ పాల్గొని కేక్ కట్ చేశారు.

ఎదులాపురం, డిసెంబర్ 25: జిల్లా ప్రజలకు బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సేవ దృక్పథంతో మానవాళి శాంతి స్థాపన నెల కోరుతుందని ఏసు ప్రభు జీవిత చరిత్ర అందుకు నిదర్శనంగా నిలుస్తుందని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో క్రిస్టియన్ మైనార్టీలకు పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని కొనియాడారు.

వీడీసీ కమిటీ సభ్యులకు సన్మానం

వీడీసీ సభ్యులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఇచ్చోడ, డిసెంబర్ 25 : ఇటీవలు ఎన్నికైన ఇచ్చోడ వీడీసీ కమిటీ సభ్యులను బుధవారం శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించారు. అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడు చెన్నాల మల్లేశ్ రెడ్డి, సలహా సభ్యులు కొండ ప్రసాద్, సువర్ణ మహాదేవ్, బద్ధం పురుషోత్తం రెడ్డి, హనుమంత్ రెడ్డి, వెన్నెల కృష్ణ, సామాజిక కార్యకర్త నిమ్మల సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

మాట్లాడుతున్న తపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రాజేశ్వర్

భైంసా, డిసెంబర్ 25 : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని తపస్ జిల్లా గౌరవాధ్యక్షుడు రాజేశ్వర్ అన్నారు. బుధవారం భైంసాలోని కిసాన్ గల్లి శిశు మందిర్ పాఠశాలలో జిల్లా స్థాయి ఖేల్‌కుద్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విభాగ్ సహ కార్యదర్శి సిరికొండ దామోదర్, పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ నగేశ్, ఆర్ రాజేశ్వర్, ఆకుల గోపాల్, చక్రపాణి, దత్తాత్రి, ప్రధానాచార్యులు భోజన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు

బజార్‌హత్నూర్, డిసెంబర్ 25: బజార్‌హత్నూర్‌లోని భీమన్న కాలనీ మైదానంలో బుధవారం బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సహకారంతో అనిల్ అన్న యువసైన్యం సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భగత్ వినోద్ స్మారకార్థం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఎస్ఐ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజారాం, నెట్‌క్యాప్ మాజీ డైరెక్టర్ చిల్కూరి భూమయ్య, నాయకులు లక్ష్మణ్, వినోద్, శరత్‌కృష్ణ, నరేందర్, అజయ్, మైస భోజన్న, సాయితారక్, జనార్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ, బీఆర్ఎస్ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్

ఎదులాపురం, డిసెంబర్ 25: మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, జిల్లా ప్రధానకార్యదర్శి దేవేందర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు చిరంజీవి, మంతెన కాంతారావ్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ వచ్చే నెల జనవరి 15వ తేదీలోపు మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించేందుకు నిర్ణయం జరిగిందన్నారు. రాష్ట్ర మహాసభల కంటే ముందు జిల్లా మహాసభలు జరుపుకోవాలన్నారు. జనవరి 4వ తేదీన ఆదిలాబాద్ జిల్లా మహాసభలు జరుపుకోవాలని తెలిపారు. ఈ సభలో కార్మికుల సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు నారాయణ రెడ్డి, అశోక్, సురేశ్, శంకర్, లక్ష్మి, పాచ్చిరాం, శాంత, యాదగిరి, లక్ష్మణ్, కార్మికులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయండి

పోస్టర్ విడుదల చేస్తున్న సభ్యులు

ఎదులాపురం, డిసెంబర్ 25 : సమత సైనిక్ దళ్ రాష్ట్రీయ శ్రామణేర్ –సైనిక్ శిక్షణ శిబిరాన్ని ఆదిలాబాద్‌లోని అశోక బుద్ధ విహార్‌లో జనవరి 17 నుంచి ప్రారంభిస్తున్నట్లు కేంద్ర కమిటీ సభ్యుడు రవిచంద్ర జాబాడే తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ శిక్షణ శిబిరంలో ఉమ్మడి జిల్లా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ శిక్షణలో భారత రాజ్యాంగం, తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సభ్యులు రమకాంత్ కాంబ్లే, విశ్వభూషనవ వాగ్మారే, శిలానంద్ కాంబ్లే, రవి, ప్రశేంజిత్ వాగ్మారే, సోమనగులే పాల్గొన్నారు.

వాగులో జోరుగా ఇసుకదందా

లక్ష్మణచాంద, డిసెంబర్ 25: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద, కనకాపూర్ గ్రామాల సమీపంలోని వాగులో ఇసుకదందాకు అడ్డు అదుపు లేకుండా సాగుతుంది. వాగులో విచ్చలవిడిగా ఇసుకను తవ్వుతున్న సంబంధిత అధికారులు అటువైపు కనీసం చూడడం లేదు. కనకాపూర్ గ్రామంలోని వాగు నిర్మల్ – ఖానాపూర్ ప్రధాన రహదారి బ్రిడ్జి పక్కనే ఇసుకను తవ్వి వాగు ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. అనంతరం ట్రాక్టర్ల సహాయంతో నిర్మల్‌కు తరలిస్తున్నారు. అలాగే వడ్యాల్ గ్రామ సమీపంలోని వాగులో తవ్విన ఇసుకను ప్రధాన రహదారికి సమీపంలో తరలించి డంప్ చేస్తున్నారు. డంప్ చేసిన ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా నిర్మల్‌కు తరలిస్తున్నారు. పట్టపగలే ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు అటువైపు చూడడం లేదు.

వాగుల్లో నుంచి ఇసుక తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవు

-జానకి, తహసీల్దార్, లక్ష్మణచాంద,

వాగుల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం ఎటువంటి అనుమతి ఇవ్వలేదు. లక్ష్మణచాంద మండలంలో ఎక్కడ ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. వడ్యాల్, కనకాపూర్ గ్రామాల్లో ఇసుక దందాపై ఎటువంటి సమాచారం లేదు. విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకుంటాం.